క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కంటివైద్య శిబిరం విజయవంతం


వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులోని అంకాలమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని చాకరాజువేముల గ్రామానికి చెందిన రాధికా క్రిష్ణారెడ్డి సహకారంతో గంగవరం క్రిష్ణారెడ్డి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉదయానంద వైద్యశాల వైద్యులు కంటిలోపం ఉన్న 250 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుష్ యోగా సేవాసమితి నిర్వాహకులు ఆనంద్ గురూజీ, బత్తుల నాగేశ్వరరావు, బాల ఉసేని తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత


ట్రైసైకిల్‌ను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణానికి చెందిన ఆశీర్వాదం అనే దివ్యాంగుడికి కోవెలకుంట్ల విక్కీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గోపిరెడ్డి ట్రైసైకిల్ అందజేశారు. పట్టణంలోని రామనాథ్ థియేటర్ సమీపంలో నేలపై పాకుతూ వెళుతున్న ఆశీర్వాదాన్ని గోపిరెడ్డి ఇటీవల చూశారు. ఆదివారం ట్రైసైకిల్ అందించారు. దాతకు రుణపడి ఉంటానని ఈ సందర్భంగా దివ్యాంగుడు చెప్పారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ సుబ్బారెడ్డి, హుసేన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ


సువర్ణాదేవి

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సువర్ణాదేవి నంద్యాల కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ ఏడాది జూన్ 18వ తేదీన ఉయ్యాల వాడ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. మూడు నెలలు గడవక ముందే ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు కార్యాలయానికి ఆదివారం అందాయి. ఈమె స్థానంలో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ బాబుకు పూర్తి బాధ్యతలు అప్పగించారు.

డీఎస్సీలో క్రీడాకారులకు అన్యాయం

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం.4 ద్వారా అనేక మంది క్రీడాకారులకు డీఎస్సీ నియామకాల్లో అన్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు సన్నాల సాయిరాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జీవో నం.74 ద్వారా క్రీడా నియామకాలు చేపట్టిందన్నారు.నేషనల్ చాంపియన్స్, గేమ్స్‌లలో ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రస్తుత జీవో ద్వారా నేషనల్ చాంపియన్స్‌లో మెడల్స్ సాధించినవారికి అన్యాయం జరుగుతుందన్నారు. సర్కారు స్పందించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

కిందపడి యువకుడి మృతి

మహానంది: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా స్పృహ తప్పి పడిపోవడంతో గాయాలై కోలుకోలేక మృతి చెందిన సంఘటన ఆదివారం తమ్మడపల్లెలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వనం మధు (22) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. కొంత కాలంగా టీబీతో బాధపడుతున్న మధు ఇంటి నుంచి బయటికి వచ్చే క్రమంలో సీసీ రోడ్డుపై నడుచుకుంటూ వస్తూ స్పృహ తప్పి పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లగా.. కోలుకోలేక మృతి చెందాడని మహానంది పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి బాలసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

రైతుల గోడు పట్టని సర్కారు

- యూరియా కోసం రైతులు క్యూలైన్లో నిలబడాల్సిన పరిస్థితి తెచ్చారు
- చంద్రబాబుపై ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: కూటమి సర్కారుకు రైతుల గోడు పట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మండిపడ్డారు. రైతు భరోసా కేంద్రాల్లో రూ.260కు అందాల్సిన యూరియాను కూటమి నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి రూ.400 నుంచి రూ.600కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదని చెప్పారు. ఈనెల 9న ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించి మాట్లాడారు. ఎరువుల కోసం రైతులు ఆగచాట్లు పడుతుంటే చంద్రబాబు సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో 6లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని రాష్ట్రమంత్రి అచ్చెనాయుడు, సీఎం చంద్రబాబు నాయుడు చెబుతున్నారు. మరి యూరియా కొరత ఎందుకు ఏర్పడిందో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ కాకుండా తామే రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామన్నారు. రెండేళ్లకు రూ. 40వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.5వేలు ఇచ్చి సర్కారు చేతులు దులుపుకుందన్నారు. ఇదంతా అధికారం కోసం రైతులను మోసం చేయడమే కదా అన్నారు. సూపర్ సిక్స్ అమలు చేశామంటూ డబ్బాలు కొడుతున్నారు. 50 ఏళ్లకు ఎస్సీ,ఎస్టీ, బీసీలకు పింఛన్లు, ఆడపడుచులకు నెలకు రూ.1500 ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకాన్ని సైతం అరకొర మందికే ఇచ్చారని ఆరోపించారు. సూపర్ సిక్స్ అంతా మోసమని చెప్పారు. పింఛన్లు మూడింతలు పెంచామంటూ దివ్యాంగుల గొంతులు కోస్తున్నారన్నారు. అర్హత ఉన్న వారికి పింఛన్లు తొలగించి రోడ్లపాలు చేసి ఆత్మహత్య చేసుకునేలా చేశారు. ఫ్రీ బస్ అంటూనే ఆటో డ్రైవర్ల నోట్లు మట్టికొట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు ఇచ్చేవారని, ఇప్పుడు ఈ పథకం ఊసే లేదన్నారు. ఉల్లి, మామిడికి రేట్లు లేకుండా చేశారన్నారు. కోవిడ్‌లో ఉల్లికి ధర పడిపోతే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.9 వేల కోట్లు వెచ్చించి కొనుగోలు చేసి ఎగుమతి చేశారని గుర్తు చేశారు. కర్నూలు జిల్లాలో ఉల్లికి ధర లేక ఇటీవలే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వంలో కదలిక లేదని చెప్పారు. యూరియా ఇబ్బందులపై గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా ఎటువంటి ఫలితం లేదన్నారు. ఈనెల 9న చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఆర్‌డీఓకు వినతి పత్రం అందించాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు యూరియా అందేలా చూడాలన్నారు.

ఆళ్లగడ్డలో దారుణ పరిస్థితులు

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో దారుణ పరిస్థితులు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 'అహోబిలంలో తలనీలాలకు సంబంధించి వేలం గతంలో రూ.2కోట్లకు పోతే ఈసారి రూ.1.50 కోట్లకు పోయింది. అక్టోబరు నాటికి డబ్బులు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు ఒక్క కంతు కూడా చెల్లించ లేదు. ఈ నేపథ్యంలో వేలం పాటను రద్దు చేసి రీటెండర్లు పిలవాలి. అలాగే కొబ్బరి కాయల టెండర్లు గతంలో రూ.70 లక్షలకు పోతే ఈ సారి రూ.35 లక్షలకు సవాలు పాడి రూ.19లక్షలే చెల్లించారు. ఇంకా 16లక్షలు చెల్లించ లేదు. ఎమ్మెల్యే గతంలో అహోబిలంపై అదిచేశారు.. ఇది చేశారంటూ మాట్లాడారు. ఆ ఎమ్మెల్యేకు సంబంధించినోళ్లే కదా ఇప్పుడు టెండర్లు పాడింది. వారు పూర్తి డబ్బులు ఎందుకు చెల్లించడం లేదు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల'న్నారు. పోలీసులు, అహోబిలం మఠం వారు న్యాయబద్ధంగా టెండర్లు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మనకున్న గొప్ప పుణ్యక్షేత్రం అహోబిలానికి నష్టం జరిగేలా చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి నాయకులు శివనాగిరెడ్డి, సింగం వెంకటేశ్వరరెడ్డి, గంగుల రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పయిడేలా శివరామిరెడ్డి, రాజారెడ్డి, గూబగుండం వెంకటసుబ్బారెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు, పలచాని లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్‌లకు బాబు మొండిచేయి


ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాల పెండింగ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఆదాయం లేని మసీదుల ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా కూటమి సర్కారు జాప్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు షబ్బీర్, చాగలమర్రి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్‌లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 11 నెలలుగా ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలు పెండింగ్ పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8న జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలు పెంచుతామని కూటమి సర్కారు మేనిఫెస్టోలో చెప్పి మాటతప్పిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లిం మైనార్టీల పట్ల కపటప్రేమ ప్రదర్శిస్తున్నారన్నారు. వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఉన్నారు

గురువులు మార్గదర్శకులు


రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు సాధించిన ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): గురువులు మార్గదర్శకులని ..సమాజంలో వారి పాత్ర ఎనలేనిదని డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్, డోన్ ఉప విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి, నంద్యాల మాజీ ఉప విద్యాశాఖ అధికారి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీకృష్ణ మందిరంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన పై అధికారులు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థుల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుంటారన్నారు. నేటి సమాజంలో యువత చెడు దారిలో నడుస్తున్నారని, వారిని క్రమశిక్షణలో పెట్టి మంచి విద్యను అందించాలన్నారు. ఉత్తమ అవార్డు స్వీకరించిన ఉపాధ్యాయులపై ఈ బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. నూతన సాంకేతికతను వినియోగించుకొని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలు మగ్బుల్‌బాషా, సుబ్బయ్య, శేషఫణి, లక్ష్మయ్యలతో పాటు జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలు తిరుపతిరెడ్డి, పాపోడు, ఉదయ్, ప్రేమ్‌కుమార్, శ్రీధర్, షేక్షావలి, మోహిద్దీన్, నరసింహులు, శివనాగేశ్వరరావు, పద్మావతి, జెషిత, ఫర్హానాబేగం, సుదర్శన్‌రెడ్డి, హుస్సేన్‌సాహెబ్, నాగేంద్రకుమార్, మల్లికార్జునప్ప, కాశీంసాహెబ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివయ్య, రామచంద్రారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు బాలనాగిరెడ్డి, సుకుమాంబకుమారి, భాస్కరరెడ్డి, వెంకటరామిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, పార్థసారథిరెడ్డి, రాజేష్, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యం


మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దామోదర్

నంద్యాల(వ్యవసాయం): ప్రజల్లో మూఢనమ్మకాలను పారద్రోలి విజ్ఞానాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని ఆ సంస్థ జాతీయ నాయకుడు మహమ్మద్ మియా, జిల్లా అధ్యక్షుడు దామోదర్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మదద్ ఫౌండేషన్ కంప్యూటర్ సెంటర్‌లో జిల్లా జన విజ్ఞాన వేదిక ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం లేని జనవిజ్ఞాన వేదికను నంద్యాల జిల్లాలో బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో నూతన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. నంద్యాల జిల్లా తాత్కాలిక కమిటీ సభ్యులుగా నూర్ భాషా యాకూబ్, నాగేశ్వర్ రెడ్డి ,ఆంజనేయులు, రమేష్, హేమంత్, రమణారెడ్డి, జైపాల్, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయసాగర్, వెంకటయ్య, శంభు, అరుణను ఎన్నుకున్నట్లు తెలిపారు.

లోక కల్యాణం కోసం హోమాలు


హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ హౌసింగ్ బోర్డ్ కాలనీలో అమర యోగ వికాస కేంద్రంలో ఆదివారం నిర్వాహకులు యోగానంద ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రహణ సమయం ప్రకృతిలో ప్రత్యేక శక్తులు ఉంటాయని, ఆ శక్తుల మధ్య హోమం చేస్తే ఆరోగ్య దోషాలు తగ్గుతాయని, మనసుకు ప్రశాంతి,ఆత్మబలం పెరుగుతుందని యోగానంద తెలిపారు. గ్రహణం సమయంలో మంత్రాలు, జపాలు, హోమాలు చేయడం వలన సహస్ర గుణిత ఫలితం వస్తుందని స్కాంద పురాణం, మత్స్య పురాణం వంటి గ్రంథాలలో ఉందని తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో తిమ్మయ్య గాంధీ వెంకటేశ్వర్ రెడ్డి రఘునాథరెడ్డి అనిల్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న శంకర్

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు చౌడప్ప, ఎం.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. సంక్షేమ బోర్డు నుంచి కోట్ల రూపాయలను ఇతర రంగాలకు తరలిస్తున్నారన్నారు. 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికుడికి రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు రఫీ, పఠాన్ యాకూబ్, ఖాజామియా, తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

టీ కొట్టులో అగ్నిప్రమాదం


కాలిపోయిన టీ కొట్టు

శిరివెళ్ల: యర్రగుంట్లలోని ఓ టీ కొట్టులో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మస్తాన్ వలి దర్గా వద్ద బాల నాగయ్య రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని టీ దుకాణం పెట్టుకున్నాడు. షెడ్‌లోనే దంపతులు నివాస ముంటున్నారు. టీ, కూల్ డ్రింక్స్, చిన్న పిల్లలు తినే వస్తువులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో దంపతులు నిద్ర లేచి తమ వ్యాపారం మొదలు పెట్టారు. ప్రమాదవశాత్తు సిలిండర్ లోని గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. దంపతులిద్దరు భయంతో బయటకు పరుగులు తీశారు. చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. ప్రమాదంలో దాదాపు రూ. 75 వేలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. కట్టు బట్టలతో బయట పడ్డారు.

మల్లన్న సేవలో..

శ్రీశైలంటెంపుల్: తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దంపతులు నిండునూరేళ్లు, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి,అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యం, ముందు చూపు లేకపోవడంతో తెలంగాణలో యూరియా కొరత ఏర్పడిందని విమర్శించారు.

అక్రమ తవ్వకాలపై పోలీసుల దాడులు

మహానంది: అధికారంలో ఉన్నాం.. ఎవరేం అడగరులే అని.. అనుమతులు లేకపోయినా కొందరు కూటమి నేతలు ఎర్ర మట్టిని తరలిస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. మండలంలోని గాజులపల్లె గ్రామం సమీపంలోని ఆంకిరెడ్డి చెరువును అధికార పార్టీ నేతలు కొల్లగొడుతున్నారు. ఇక్కడ ఉన్న ఎర్రమట్టి వారికి ఎర్ర బంగారమైంది. రోజుకు వందల టిప్పర్లతో మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రైల్వే పనుల కోసం అనుమతులు తీసుకున్న కాంట్రాక్టర్లు మట్టిని తరలిస్తుంటే సందట్లో సడేమియా అన్న చందంగా వారి మాటున అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తుండటం విశేషం. దీంతో పలువురు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు ఆదివారం మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి, సిబ్బంది చెరువు వద్ద దాడులు నిర్వహించి అనుమతులు లేని ఆరు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆలయాలు మూసివేత


ఆర్.జంబులదిన్నెలో లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయానికి భక్తులతో కలిసి తాళాలు వేస్తున్న అర్చకులు


వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ తలుపులు మూసివేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా నంద్యాల,ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని పలు ఆలయాలను ఆదివారం మూసివేశారు. ఉయ్యాలవాడలో ఆర్.జంబులదిన్నె శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి, సీతారామ చంద్రమూర్తి, శ్రీ అభయాంజనేయస్వామి, ఇంజేడు గ్రామంలో శ్రీ కోనేటి లక్ష్మి వెంకటేశ్వరస్వామి, సుద్దమల్ల శ్రీ లక్ష్మి కంబగిరి స్వామి ఆలయాలను భక్తులతో తరలివచ్చి ఉదయం పూజలు చేసిన అనంతరం మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి శుద్ధి, సంప్రోక్షణ జరిపించిన అనంతరం పూజలు చేపడతామని అర్చకులు లక్ష్మణ స్వామి, అనంతయ్య, కమలేష్‌శర్మ వెల్లడించారు.

రుద్రవరం: మండలంలోని వివిధ గ్రామాల్లో దేవతామూర్తుల ఆలయాలను ఆదివారం ఉదయం 10గంటల నుంచి తలుపులు మూసివేశారు. రుద్రవరం– అప్పనపల్లె దారిలో లక్ష్మీ గోదా సమేత వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అర్చకులు ఉదయం నిత్య పూజలు వంటి కార్యక్రమాలను పూర్తి చేసి 10 గంటలకు తలుపులు మూసివేశారు.తిరిగి సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయ తలుపులు తెరిచి స్వామి అమ్మవార్ల దర్శణం కల్పిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.అలాగే స్థానిక భాస్కర నందీశ్వర,కన్యకాపరమేశ్వరీ,సత్యనారాయణ స్వామి అమ్మవారి ఆలయాల తులపులను మూసివేశారు.

ఉత్సాహంగా..ఉల్లాసంగా


ఝాన్సీ లక్ష్మి ఏకపాత్రాభినయం, కళారాధన ఆధ్వర్యంలో దేశభక్తిగీతం ఆలపిస్తున్న చిన్నారులు

నంద్యాల(వ్యవసాయం): కళారాధన ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో నంద్యాల పట్టణంలో చేపట్టిన మాతృభూమికి కళార్చన పోటీలు ఉత్సాహంగా..ఉల్లాసంగా సాగాయి. ఆదివారం ఆధునిక, దేశభక్తి గీతాలపై నృత్య పోటీలు నిర్వహించారు. కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్ నటరాజు విగ్రహానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా బాలలు ఛత్రపతి శివాజీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, గాంధీ, నెహ్రూ ఏకపాత్రాభినయాలతో చూపరులను అలరించారు. ఈ పోటీలకు విజయవాడకు చెందిన శ్రీమన్నారాయణ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో రవి ప్రకాష్, అన్నెం శ్రీనివాసరెడ్డి,రంగనాథ్ ,శర్మ, వి.వి. శివరామిరెడ్డి,నాగరాజు, మజీద్,మధు, వెంకటేశ్వర్లు సూర్య ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నేడు పేరూరులో మాన్యం భూముల కౌలు వేలం



రుద్రవరం: పేరూరు ఈశ్వర, రామాంజనేయ స్వామి వారి ఆలయ మాన్యం భూ ములకు సోమవారం కౌలు వేలం నిర్వహిస్తామని ఈఓ సాయి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ ఆలయా నికి దాదాపు 70 ఎకరాల మాన్యం ఉంది. అయితే గతేడాది ఖరీఫ్ సీజన్‌కు ముందు కౌలు వేలం నిర్వహించగా వాగ్వావాదం నెలకొని వాయిదా పడింది. తిరిగి దేవదాయ శాఖ అధికారులు భారీ పోలీసు బలగాల మధ్య సెప్టెంబర్ నెలలో కౌలు వేలం నిర్వహించారు.ఈ ఏడాది ఖరీఫ్‌నకు ముందు కౌలు వేలం నిర్వహించలేక పోయారు.ఇటీవలే సాక్షిలో కౌలు వేలం నిర్వహించక పోవడంతో మాన్యం భూముల్లో చెట్లు పిచ్చి మొక్కలు పెరిగి బీళ్లుగా మారాయని కథ నం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. సోమవారం ఆ భూముల కౌలుకు వేలం వేస్తామని పేరూరుతో పాటుమజరా గ్రామాల్లో దండోరా వేయించారు.


ఉయ్యాలవాడ, రూపనగుడి గ్రామాల మధ్య కుందూనది వంతెనపై నిలిచిన వర్షపు నీరు

వర్షం వస్తే ఇంతే

ఉయ్యాలవాడ : మాయలూరు, ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో ఉయ్యాలవాడ, రూపనగుడి గ్రామాల మధ్య ఉన్న కుందూనది వంతెనపై రెండు వైపులా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి పైపులైన్, టెలిఫోన్ శాఖ వారు లైన్ ఏర్పాటుకు దిమ్మెలు ఏర్పాటు చేశారు. చిన్నపాటి వర్షం కురిసినా ప్రతి సారి వర్షపు నీళ్ల వంతెనపై నిల్వ చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా పైపులైన్ లీకేజీ ఏర్పడిన సందర్భాల్లో కూడా వృథా నీరు వంతెనపై నిలుస్తూ ఉంది. నిలిచిన వృథా, వర్షపు నీరు వెళ్లే మార్గం లేక వంతెన దెబ్బతింటూ వుంది. ఈ రహదారిలో నిత్యం తాడిపత్రి, తిరుపతి, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ పట్టణ ప్రాంతాలకు ఆర్‌టీసీ బస్సులు, భారీ వాహనాలు వెళుతూ ఉంటాయి. సింగల్ వే వంతెన కావడం..దానికితోడు దెబ్బతిని ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో 'విజిలెన్స్' దాడులు

- రూ. 22.39లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపివేత
- మరో 100 యూరియా బస్తాలు సీజ్


బుక్కాపురం బైసాని ట్రేడర్స్ దుకాణంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మహానంది: ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తుండటం, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండటంతో జిల్లా స్థాయిలో విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా మండలంలోని బుక్కాపురం, గాజులపల్లె గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆదివారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ వెంకటప్రసాద్, ఏఓ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మూడు దుకాణాల్లో దాడులు చేశారు. వారు మాట్లాడుతూ బైసాని ట్రేడర్స్, గఫారియా ఫెర్టిసైడ్స్ దుకాణాల్లో రూ. 22,39,076 విలువజేసే 79.22 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, యూరియా ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు. మహానందీశ్వర ఫర్టిలైజర్స్ అండ్ ఫెర్టిసైడ్స్ దుకాణంలో యూరియా బస్తా రూ. 266.50 కాగా రూ. 300కు విక్రయిస్తున్నట్లు నిర్ధారించి ఈసీ చట్టం 1955 ప్రకారం 6ఏ కింద కేసు నమోదు చేసి సీజ్ చేశామని వెల్లడించారు.